సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 28 । ఆగస్టు । 2024



హడలెత్తిస్తున్న ప్రమాదాలు

జాతీయ రహదారులు మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. నిత్యం ప్రమాదాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. -8లో



అంధత్వ నివారణకు అడ్డుకట్ట వేద్దాం

జాగ్రత్తలతో అంధత్వ నివారణకు అడ్డుకట్ట వేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.8/26.4

జిల్లాలో మంగళవారం 26.4 – 36.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

భయమేస్తోంది



కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై సంఘటన జరిగినప్పటి నుంచి భయమేస్తోంది. మహిళలు ధైర్యంగా విధులకు రావాలంటే పెద్ద ఎత్తున పెట్రోలింగ్ చేయాల్సి అవసరం ఉంది.ఇలా చేయడం వల్ల మహిళా ఉద్యోగులే కాదు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు భద్రత అనేది ఉంటుంది. –వి.వాణి, వైద్యాధికారిణి, చక్రాయపేట ప్రభుత్వ వైద్యశాల

బహిరంగంగా ఉరి తీయాలి



మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడిన దుండగులను తక్షణం ఉరి తీయాలి. గల్ఫ్ కంట్రీస్‌లో తప్పు చేసిన వారిని అప్పటికప్పుడే బహిరంగంగా శిక్షిస్తారు. అలాంటి చట్టాలు మన దేశంలో కూడా తీసుకురావాలి. అపుడే మహిళా వైద్య సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వర్తిస్తారు. –డా. బి. మహినూరు, మెడికల్ ఆఫీసర్, పెద్దచెప్పలి పీహెచ్‌సీ, కమలాపురం మండలం.

కఠిన చర్యలు తీసుకోవాలి



వైద్యులు...వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణం కఠిన చర్యలు చేపట్టాలి. చట్టాలు కఠినంగా అమలైతే వైద్య సిబ్బందిపై దాడులకు ఎంతటి వారైనా భయపడతారు. ఆ భయంతో పొరపాటు చేయడానికి వెనుకంజ వేస్తారు. ముందస్తుగా వైద్య సిబ్బందిపై ఎలాంటి దాడులకు జరగకుండా చర్యలు తీసుకోవాలి. – గగ్గుటూరు కమాల్ బీ, రాష్ట్ర కో ఆర్డినేటర్, స్ట్రగుల్ కమిటీ

పెంపకంలోనే మార్పు రావాలి



భద్రతతో పాటు పిల్లల పెంపకంలోనూ మార్పు రావాలి. ఆడపిల్లలు బయటకు వెళ్లి ఆలస్యంగా వస్తే తల్లిదండ్రులు ప్రశ్నిస్తారు. కానీ మగపిల్లలు అర్ధరాత్రి వచ్చినా పట్టించుకోరు. వారిలో చిన్నప్పటినుంచి మంచి పద్ధతులు అలవర్చుకునేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.– సుజాత, వైద్యురాలు, కొండాపురం

న్యూస్‌రీల్

నేడు ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌డ్రైవ్

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో ఈనెల 28వతేదీ బుధవారం జాబ్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌డ్రైవ్‌కు బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన 27 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9347256400, 9390052901 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

29న క్రీడా ప్రతిభా అవార్డులు ప్రదానం

కడప స్పోర్ట్స్: ఎర్రగుంట్ల మండలం కలమల్లలోని చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 29వ తేదీన క్రీడాప్రతిభా అవార్డులను అందజేయనున్నట్లు డీఈఓ ఎం. అనూరాధ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడాపోటీల్లో జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 5 పాఠశాలలకు క్రీడాప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పైన తెలిపిన వేదికలో హాజరుకావాలని కోరారు.


రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు డీఏవీ భారతి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

కమలాపురం: మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ భారతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్. కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25న ప్రొద్దుటూరులోని మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో డీఏవీ భారతి స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బి. చంద్ర ఓబుళరెడ్డి అండర్–16 బాలుర షార్ట్ పుట్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అలాగే 9వ తరగతికి చెందిన జి.గురు కీర్తన అండర్–16 బాలికల షార్ట్ పుట్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరు త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. పరిశ్రమ సీఎంఓ సాయి రమేష్, హెచ్‌ఆర్ చీఫ్, గోపాల్‌రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీడీ చందును అభినందించారు.

'గండికోట'కు కొనసాగుతున్న ఇన్ ఫ్లో



గండికోట జలాశయం

కొండాపురం: జిల్లాలో సాగు,తాగునీటి అవసరాలకోసం నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాలువ ద్వారా కృష్ణజలాలు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు జలవనరులశాఖ సీఈ మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో పూర్తిగా నీటి సామర్థ్యం ఉండటంతో అక్కడ నుంచి అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరునగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా గండికోట టర్నల్ లో నుంచి 11 వేల క్యూసెక్కుల కృష్ణజలాలు ఇన్‌ఫ్లో వస్తున్నాయన్నారు. గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26. 85 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 17.6 టిఎంసీలకు చేరినట్లు ఆయన తెలిపారు. గండికోట జలాశయం నుంచి శెట్టి వారి పల్లె వద్ద మెయిన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి జీఎన్ ఎస్‌ఎస్ కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీరు సర్వారాయసాగర్ కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కడప గడపలో విష సంస్కృతి!

ఆమె ఓ ప్రజా ప్రతినిధి.. ప్రజా సేవలో తరించడమే ఆమె విధి.. వీలైతే సమస్యలకో పరిష్కారం చూపాలి.. కుదిరితే ఓ నాలుగు మంచి పనులు చేయాలి... ఇప్పుడవేమీ పట్టించుకోవడం లేదు. అందలమెక్కింది మొదలు సేవను పక్కతోవ పట్టించి..మంచిని ఎప్పుడో అటకెక్కించింది. తనకు సహకరించలేదని సొంత పార్టీ నాయకురాలిపైనే మాటల దూషణలకు దిగిన మనస్తత్వం ఆమెది. ప్రజా సేవలో చిత్తశుద్ధి కరువై..'చెత్త' పాలనకు తెరతీసింది. ఆమే.. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి. ప్రశాంతతకు.. శాంతి భద్రతలకు..మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న కడప గడపలో విష సంస్కృతికి బీజం వేస్తోంది.



మేయర్ కె. సురేష్‌బాబు ఇంటి వద్ద ఆందోళన చేయడంతో పాటు చెత్తను వేసిన టీడీపీ కార్యకర్తలు, ప్రజలు

- కవ్వింపు చర్యలకు దిగుతున్న ఎమ్మెల్యే మాధవి రెడ్డి
- ఆమె ప్రోద్బలంతో మేయర్ ఇంటివద్ద చెత్త వేసిన 'పచ్చ' నేతలు

సాక్షి ప్రతినిధి,కడప: కడప నగరం.. ప్రశాంతతకు మారు పేరు. మత సామరస్యానికి మరో పేరు. శాంతి భద్రతలకు నిలయంగా అలరారుతున్న జిల్లా కేంద్రమైన కడపలో మెల్లగా విష సంస్కృతి పాకుతోంది. అధికార పార్టీ అడుగడుగునా కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ముఖ్యంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి వ్యక్తులే టార్గెట్‌గా వ్యవహరిస్తూ ఎన్నడూ లేని చెడు సాంప్రదాయాన్ని తెరపైకి తెస్తున్నారు. దీన్ని సాకుగా తీసుకుని 'పచ్చ' నేతలు నిత్యం విషం కక్కుతున్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి చర్యల కారణంగా కడప ప్రథమ పౌరుడు మేయర్ సురేష్‌బాబు నడిరోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టాల్సి పరిస్థితి ఉత్పన్నమైంది.

సేవలో చిత్త శుద్ధి లేకే కవ్వింపు చర్యలు

కడప నగరంలో చెత్త సేకరణలో అలసత్వం ఉంటే, ఎమ్మెల్యేగా చేయాల్సిన పని ఏంటి? కమీషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి. లేదంటే కలెక్టర్‌తో చర్చించి ఆ సమస్యకు పరిష్కారం చూపెట్టాలి. అప్పటికీ కాదు, కూడదంటే మున్సిపల్‌శాఖ మంత్రి లేదా ప్రభుత్వ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలి. కాగా కడప ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి కరువై అందుకు భిన్నంగా వ్యవహరించారు. మీడియా సమావేశం పెట్టి మేయర్, కార్పొరేటర్లను టార్గెట్ చేస్తూ మాట్లాడారు. చెత్త ఎత్తకపోతే మేయర్ ఇంటివద్ద వేయాలంటూ పిలుపునిచ్చారు. తందానా బ్యాచ్ మంగళవారం అన్నంత పనిచేశారు. నినాదాలు చేస్తూ రెచ్చగొట్టే చర్యలకు దిగారు. పనిగట్టుకొని లేని చెత్తను తీసుకవచ్చి మేయర్ ఇంటి ప్రాంగణంలో వేశారు. ఈ పద్ధతి సమంజసమేనా? అని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేగా సమస్య పరిష్కారానికి చొరవ చూపితే, వ్యక్తిగతంగా మంచి పేరు లభిస్తోంది. అలా కాకుండా అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అసలు ప్రజా సేవ చేయాలన్న చిత్తశుద్ధి లేకే ఈ విధంగా వ్యవహరిస్తోందని జనాలు తూర్పారబడుతున్నారు.

కలుషితమవుతున్న ప్రశాంతత....

కడప నియోజకవర్గ బాధ్యులుగా కోటిరెడ్డి, రహంతుల్లా, పుల్లగూర శేషయ్య, గజ్జల రంగారెడ్డి, రామచంద్రయ్య, రామమునిరెడ్డి, కందుల శివానందరెడ్డి, అహమ్మదుల్లా లాంటి ఎందరో ప్రాతినిథ్యం వహించారు. 16వ ఎమ్మెల్యేగా మాధవిరెడ్డి ఎంపికయ్యారు. ఇంతటి చరిత్రలో ఎప్పుడు విపక్షనేతలను టార్గెట్ చేసిన సందర్భం లేదని పలువురు వెల్లడిస్తున్నారు. నిజంగా బాధితులు ఎవరైనా మేయర్ ఇంటివద్దకు వెళ్లారా అంటే అదీ లేదు. తందానా బ్యాచ్ ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున మహిళలకు చెల్లించి పెట్టుడు మనుషులను తరలించారు. అప్పటికప్పుడు చెత్త బుట్టలు సమకూర్చుకొని వెళ్లి హంగామా చేశారు. తొలిసారి ఇలాంటి దుస్థితి తెరపైకి రావడంతో నగర ప్రథమపౌరుడు మేయర్ నడిరోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టాల్సి వచ్చింది. అంతే స్పీడుగా ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైతం విఫలయత్నం చేశారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సమర్థవంత అధికారిగా పేరుంది. ఇలాంటి చర్యల పట్ల ఆదిలోనే ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

కడప ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

- చెత్తను వేసిన వారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలి
- కడప నగర మేయర్ కె. సురేష్ బాబు



చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ వద్దకు పార్టీ నాయకులు, కార్పోరేటర్లతో చేరుకుంటున్న మేయర్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌కు కేవలం 300 మీటర్ల దూరం ఉన్న తన ఇంటి ముందు టీడీపీ కార్యకర్తలతో కొందరు ప్రజలను రెచ్చగొట్టి చెత్తతో బైఠాయించడమే కాకుండా చట్ట విరుద్ధంగా తన ఇంట్లోకి చెత్త పారవేయడం ఎంతవరకు సమంజసమని కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం మేయర్ కె.సురేష్‌బాబు కడపలోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చారు. వేడుకలను ముగించుకుని తిరుపతి వైపు ప్రయాణం సాగించారు. సరిగ్గా రాజంపేట సమీపంలోకి చేరుకోగానే, అప్పటికే టీడీపీ కార్యకర్తలను, కొందరు ప్రజలను రెచ్చగొట్టిన కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, వారిచేత తన ఇంటి ముందు ఆందోళన చేయించడమేగాక, ఏకంగా తన ఇంటిలోపలికే చెత్తను విసిరివేయించడం సరికాదన్నారు. కడప నగరంలోని కార్పోరేషన్ పరిధిలో చెత్త పన్ను వసూలు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం మౌఖికంగా ఆదేశాలు వచ్చాయేగానీ జీ.ఓ ఇంతవరకు విడుదల చేయలేదని మేయర్ కె. సురేష్‌బాబు తెలియజేశారు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి చెత్తసేకరణపై రాద్ధాంతం చేసి తమ పార్టీ కార్యకర్తలను, కొంతమంది ప్రజలను తన ఇంటిపై చెత్తను వేయించే సాహసం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కడప ఎమ్మెల్యే బుద్ధిలేక చేసిన పనికి తాము పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా చర్యలను తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ మూడు నెలల్లోనే చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకులపై, కార్యకర్తలపై వ్యక్తిగతంగా దాడులకు పాల్పడటం, ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. తానుగానీ, తమ పార్టీ కార్యకర్తలుగానీ కడప ఎమ్మెల్యే ఇంటిలోకి చెత్తవేయడం ఎంతసేపు అని ప్రశ్నించారు.. కానీ తాము సంయమనం పాటిస్తూ, ఇలాంటి దిక్కుమాలిన పనికి పాల్పడేందుకు రెచ్చగొట్టిన కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిపై కేసు నమోదు చేయాలనీ, ఇందుకు కారణమైన మిగతా టీడీపీ కార్యకర్తలు, బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలను తీసుకోవాలనీ డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సంఘటనలో స్పెషల్ బ్రాంచ్ వారు ముందుగానే పరిస్థితిని గమనించి పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తన ఇల్లు పోలీస్‌స్టేషన్‌కు 300 మీటర్ల దూరంలో వుందనీ పోలీసులు వెంటనే స్పందించి ఉంటే ఇంత సంఘటన జరిగి ఉండేది కాదని అన్నారు.

- కడప నగర మేయర్ ఇంటి వద్ద చెత్తను వేసిన వారిపై చట్టపరంగా చర్యలను తీసుకుంటామనీ కడప అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు తెలియజేశారు. సంఘటనపై ఇప్పటివరకు వచ్చిన, లభించిన ఆధారాల మేరకు ఉన్నతాధికారులతో చర్చించి చట్టపరంగా ఏమేమి చర్యలను తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే ఘర్షణ వైఖరి మానుకోవాలి

కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఘర్షణ వైఖరి మానుకోవాలి. ఆమె ప్రజాప్రతినిధులనే గౌరవం లేకుండా ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్నారు. రాజకీయాల్లో ఇది మంచి సాంప్రదాయం కాదు. కక్ష పూరితంగా వ్యవహరిస్తూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. – త్యాగరాజు, 26వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జి, కడప

మేయర్ ఇంటివద్ద చెత్త వేయడం సరికాదు

మేయర్ సురేష్‌బాబు ఇంటి వద్ద టీడీపీ నాయకులు చెత్తవేయడం సరికాదు. వైఎస్సార్ సీపీ పాలకవర్గం వచ్చినప్పటి నుంచి కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మేయర్‌తోపాటు కార్పొరేటర్లు సమిష్టి కృషి చేస్తున్నాం. ఎమ్మెల్యే ఇలా రెచ్చగొట్టి మేయర్ ఇంటి వద్ద చెత్తవేయడాన్ని ప్రజలు కూడా హర్షించడం లేదు. – రామలక్ష్మణరెడ్డి, కార్పొరేటర్, కడప

ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదు

క్లాప్ ప్రోగామ్ కడపలో మొదలు పెట్టినపుడు రాష్ట్రంలో మొట్టమొదటగా ప్రజల పక్షాన నిలిచి యూజర్ ఛార్జీలు తగ్గించాలని అడిగిన ఘనత మాకే దక్కుతుంది. మేయర్ ఇంటివద్ద చెత్తవేయడం ఘర్షణ పూరిత వాతావరణం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి క్లాప్ నిర్వహణపై క్లారిటీ ఇప్పించాలి. – పాకా సురేష్‌కుమార్, కార్పొరేటర్, కడప

పారదర్శకంగా ఇసుక సరఫరా!

కలెక్టర్ శివశంకర్ లోతేటి



ఇసుక రవాణా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ విధానం జిల్లాలో చట్టబద్ధంగా, సజావుగా, సులభతరంగా సాగేలా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ అదితిసింగ్‌తోకలిసి కలెక్టర్ శివశంకర్ ఇసుక రవాణా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ఇసుక రవాణా కాంట్రాక్టర్లు, జిల్లా రవాణా శాఖ అధికారులు, మైనింగ్ అధికారులతో కలిసి ఇసుక స్టాక్ పాయింట్ నుంచి వినియోగదారుని ఇంటి వరకు ఇసుకను సరఫరా చేసేందుకు రవాణా చార్జీలను నిర్ణయించామన్నారు. టన్ను ఇసుకను స్టాక్ పాయింట్ నుండి వినియోగదారుల ఇంటి వరకు చేర్చేందుకు కిలో మీటరుకు రూ.9 ల చొప్పున రవాణా చార్జీలను నిర్ణయించామని వివరించారు. జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ఇసుక రవాణా చార్జీలను అతిక్రమించి అదనపు ఛార్జీలను వసూలు చేస్తే టోల్ ఫ్రీ నెం : 08562 246344 (జిల్లా కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్) కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక అందుబాటులో ఉన్న ఎర్రబల్లి (వీ.ఎన్ పల్లిమండలం) కే.వెంకటాపురం (కొండాపురం మండలం), పి అనంతపురం (కొండాపురం మండలం), జ్యోతి (సిద్దవటం మండలం), పగడాలపల్లి (పెండ్లిమర్రి మండలం) మొదలైన 5 స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా జరుగుతోందన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేసినా, ఇసుకను బ్లాక్ మార్కెట్ చేసినా ఎవరిని ఉపేక్షించేది లేదని, చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో శాండ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ విమలమ్మ, డీటీసీ మీరా ప్రసాద్, శాండ్ స్టాక్ స్పెషల్ ఆఫీసర్ సురేష్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

జిల్లాలో తొలి తెలుగు శాసనాలు లభ్యమైన కలమల్ల గ్రామంలో ఈ నెల 29న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలుగు భాషా దినోత్సవాలను జయప్రదం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. మంగళవారం కడప కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు అందించి వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలిపే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అనూరాధ, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్కియాలజీ ఏడీ శివకుమార్, టూరిజం జిల్లా అధికారి రామ్ కుమార్, ఇంటాక్ సభ్యులు చిన్నప్ప రెడ్డి, మహబూబ్ బాషా, తెలుగు ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



కడపలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



పులివెందుల: జగన్‌క్యాంపు కార్యాలయంలో సరుకులు పంపిణీ చేస్తున్న నేతలు

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం జిల్లాలో ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రమైన కడపలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ చేశారు. అలాగే పలు చోట్ల అన్నదానం, వస్త్రదానం చేశారు. పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు తదితర చోట్ల పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఎంపీ అవినాష్‌రెడ్డి ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. –నెట్‌వర్క్

మైనింగ్ మాఫియా హల్‌చల్..!

- వేములలో విచ్చలవిడిగా రెచ్చిపోతున్న తెలుగుతమ్ముళ్లు
- అక్రమ మైనింగ్ చేస్తూ 3 ట్రాన్స్‌ఫార్మర్లను ఢీ కొట్టిన జేసీబీ
- ఫిర్యాదు చేస్తే సహించమని ట్రాన్స్‌కో అధికారులకు బెదిరింపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: మైనింగ్ మాఫియా రెచ్చిపోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పచ్చనేతలు విచ్చలవిడిగా అక్రమ ఆదాయం కోసం అర్రులు చాస్తున్నారు. వేముల మండలంలో మైనింగ్ లీజుదారులను బెదిరిస్తూ ఆ పక్కనే అక్రమ మైనింగ్‌కు పథక రచన చేస్తున్నారు. భూమి లోపల లీజుదారుల మైనింగ్‌లోకి ప్రవేశించి విచ్చలవిడిగా బెరైటీస్ దోచేస్తున్నారు. టిఫెన్ కంపెనీకి చెందిన బెరైటీస్ దోపిడిలో భాగంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. వేముల మండల వ్యాప్తంగా టీడీపీ నేతలు విచ్చలవిడిగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. లీజుదారుల మైనింగ్‌లోకి దౌర్జన్యంగా చొరబడి ముడి ఖనిజాన్ని దోచేస్తున్నారు. అడ్డుచెప్పిన వారిపై దూషణలకు దిగుతూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో అక్రమ మైనింగ్ చేస్తూ జేసీబీ ఢీ కొని విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఆ స్తంభాలపై ఉన్న 3ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. ఇదేంటీ ఇలా అడ్డదిడ్డంగా చేస్తున్నారని ప్రశ్నించిన పాపానికి ట్రాన్స్‌కో అధికారులపై రెచ్చిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తర్వాత ఉంటుందంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈమొత్తం వ్యవహారం వేముల మండల వ్యాప్తంగా ప్రజానీకం విస్తృత చర్చ నడుస్తోంది. టీడీపీ నేతల దౌర్జన్యాలకు అడ్డుకట్ట పడే అవకాశమే లేదా? అంటూ పలువురు ఆవేదన చెందుతున్నారు. కాగా ఈవిషయమై ట్రాన్స్‌కో ఏఈ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

రక్షణ కల్పించాలి



రాత్రి సమయాల్లో వైద్య వృత్తి నిర్వహించే మహిళలకు రక్షణ కల్పించాలి. ముఖ్యంగా గ్రామీణ ఆస్పత్రుల్లో నైట్ సెక్యూరిటీ పెంచాల్సిన అవసరం ఉంది. కలకత్తా వైద్యురాలిపై జరిగిన ఘటన యావత్ దేశాన్ని కుదిపేసింది. ఈ ఘటన నుంచి పాఠాలు నేర్చుకొని మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళా వైద్యులకు ప్రత్యేక గది ఏర్పాటుచేయాలి.

– డాక్టర్ సుజన, గైనకాలజిస్ట్, ప్రొద్దుటూరు

రాజకీయ జోక్యం వద్దు



మహిళలపై జరుగుతున్న అకృత్యాలలో రాజకీయ జోక్యం ఉండరాదు. అబలలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారికి రాజకీయ అండదండలు లభిస్తే వారు తిరిగి అలాంటి దుశ్చర్యలకు పాల్పడే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారిని చూచి మరింతమంది ఇలాగే తయారవుతారు. అన్నిటికీ మించి మన ఇళ్లల్లోనూ మహిళలు ఉన్నారు. ఒకరి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే ఇతరులు మన వారిని అలా చూస్తారనే భావన కలగాలి.

– జి.ఉమ, ల్యాబ్ టెక్నీషియన్, చక్రాయపేట ప్రభుత్వ వైద్యశాల



భద్రత కట్టుదిట్టం చేయాలి



ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు ఆసుపత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేయాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, ఏఎన్ఎంలకు అండగా నిలవడంతోపాటు అన్ని వసతులు కల్పించి రక్షణ కల్పించాలి. నేరాలకు పాల్పడిన వారికి విధించే శిక్ష మరొకరికి దడ పుట్టించేలా ఉండాలి.

– యస్ ధనలక్ష్మి, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్, వీరపునాయునిపల్లె

కఠిన శిక్షలు విధించాలి



మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారికి వేసే శిక్షలు కఠినంగా ఉండాలి. అది ఎలా ఉండాలంటే మరొకరు ఆ తప్పు చేయాలంటే భయపడేలా ఉండాలి. న్యాయస్థానాలు కూడా ఇలాంటి కేసుల్లో కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా శిక్షలను అమలుచేసేలా చట్టాలను తీసుకురావాలి. అప్పుడే మహిళలకు కొంత ధైర్యం కలుగుతుంది.

– జి.స్వర్ణలత, వైద్యురాలు, చక్రాయపేట ప్రభుత్వ ఆసుపత్రి

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



కమలాపురం : కమలాపురం పట్టణ పరిధిలోని పెద్ద దర్గా వద్ద గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డులో కడప నగరం చిన్న చౌక్, ముర్తురాసు పల్లెకు చెందిన బీగాల సాయమ్మగా ఉంది. మృతురాలికి 60 ఏళ్ల వయస్సు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9121100532 నెంబర్‌కు సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ సమీపంలో ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న అల్మాస్‌పేటకు చెందిన షేక్ మౌలాలి(22)మంగళవారం మృతిచెందారు. కడప నగర వనానికి వెళ్లి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా స్పోర్ట్స్ స్కూల్ వద్ద వాహనం అదుపు తప్పి మౌలాలి కిందపడ్డారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రిమ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి బద్వేల్ కోర్టు న్యాయమూర్తి మంగళవారం శిక్ష విధించినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆటో డ్రైవర్లు బాలసాని వెంకట నారాయణ(44), చీమలదిన్నె చంద్రయ్య(40) మద్యం తాగి ఆటో నడుపుతుండగా ఎస్ఐ పట్టుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరగా ఇద్దరికీ న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

హడలెత్తిస్తున్న ప్రమాదాలు

- బైపాస్ రోడ్లలో కనిపించని స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ఈ ఏడాది జూలై వరకు 311 రోడ్డు ప్రమాదాలు
- 152 మంది మృతి, గాయపడిన వారు 328 మంది

జాతీయ రహదారులు మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. నిత్యం ప్రమాదాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. పేరుకు హైవేలైనా.. మలుపుల వద్ద వాహనాలు వేగంగా దూసుకు రావడం, నియంత్రణ కోల్పోవడం వంటి ఘటనలు ప్రయాణికులను యమపురికి పంపిస్తున్నాయి. జాతీయ రహదారిపై కొన్ని చోట్ల మాత్రమే సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. చాలాచోట్ల అవి కనిపించక ప్రమాదాలు జరిగి అనేక కుటుంబాలను వీధిపాలు చేస్తున్నాయి.



కడప నగర శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ఇరుక్కున్న మృతదేహాలు

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	గాయపడిన వారు
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024 జూలై వరకు	311	152	328

కడప అర్బన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రోడ్డు ప్రయాణం నరకమైపోయింది. మనిషి హూనమైపోతున్నాడు. వాహనాలు ధ్వంసమైపోతున్నాయి. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. బైక్ మొదలు కారు వరకూ ఏ వాహనం మీద వెళ్లినా ఇబ్బందులు తప్పడం లేదు. వైఎస్సార్ జిల్లా సరిహద్దు ప్రాంతాలైన దువ్వూరు పరిధిలో, గువ్వల చెరువుఘాట్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఏకంగా ఎనిమిది మంది విలువైన ప్రాణాలు ఒక్కసారిగా గాల్లో కలిసిపోయాయి. వాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. తరచూ రహదారి నెత్తురోడుతోంది. మరమ్మతులు చేయాలని ప్రజలు అర్థిస్తున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. పెరిగిన రవాణా అవసరాలకు తగ్గట్టుగా లేని రోడ్లపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

గువ్వల చెరువు ఘాట్‌లో పెద్ద ప్రమాదం

గువ్వల చెరువు ఘాట్‌లో 2023 జనవరి, 13న రామాపురం మండలంలోని చర్చి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 11 మంది చనిపోగా వారిలో చక్రాయపేట మండలానికి చెందిన వారే 10 మంది ఉన్నారు. ఆ తర్వాత సోమవారం చిత్తూరు నుంచి ఉత్తరప్రదేశ్‌కు అమర్‌రాజా బ్యాటరీస్ లోడ్‌తో వెళుతున్న కంటైనర్ లారీ, కడప నుంచి గువ్వలచెరువు వైపు వెళుతున్న ఎతియోస్ కార్‌పైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వడ్డెపల్లెకు చెందిన వల్లెపు చిన్నవెంకటమ్మ, గుజ్జుగారి నాగయ్య, నాగలక్ష్మిదేవి మహబూబ్ షరీఫ్ అక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ మితిమీరిన వేగంతో నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

కడప సమీపంలోనూ ప్రమాదాలు

– దువ్వూరు మండలం చింతకుంట వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో కర్నూలుకు చెందిన కియాన్ సింగ్ (9నెలలు), భగత్ సింగ్(34), నాగలక్ష్మి (70) మృతి చెందారు. జూన్ 17న కడప నగర శివారులో గురుకుల పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామయ్య, సాయిగురురోహిత్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. భార్యాభర్తలు రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవిలు ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు.

ప్రమాదంగా 40వ జాతీయ రహదారి

40వ జాతీయ రహదారి ప్రమాదంగా మారింది. జూలై 6న అన్నమయ్య జిల్లా రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ దళితవాడ సమీపంలో ముందు వెళుతున్న ట్యాంకర్‌ను కారు ఢీకొని కడప వాసులు హోంగార్డు పూజారి అంజనేయులు నాయక్, అఫ్రోజ్‌ఖాన్, మూరాబత్తుల జితేంద్ర కుమార్, షేక్ హలీమ్ మృతిచెందారు. నిర్లక్ష్యం, మితిమీరిన వేగంతో ఈ దారిలోనే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

65 బ్లాక్ స్పాట్లు

జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారుల నుంచి వెళ్లే దారులు, ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్లలో మొత్తం 65 చోట్ల బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు గుర్తించారు. ఎన్‌హెచ్–40లో 5, ఎన్‌హెచ్–40 లింక్ రోడ్ల పరిధిల్లో 12 చొప్పున మొత్తం 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. ఎన్‌హెచ్–44o పరిధిలో ఐదు బ్లాక్ స్పాట్స్, ఎన్‌హెచ్–716 పరిధిలో 19, ఎన్‌హెచ్–67 పరిధిలో 09, లింక్ రోడ్ల పరిధిల్లో 12 చొప్పున మొత్తం 21 బ్లాక్ స్పాట్స్ వున్నాయి. ఈ బ్లాక్ స్పాట్స్‌ను పోలీసు, ఆర్ అండ్ బి, రోడ్డు రవాణా శాఖ అధికారులు తమతమ అధ్యయనంలో గుర్తించారు.

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కృషి



రహదారుల వెంబడి రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి బ్లాక్ స్పాట్ గుర్తించడం భవిష్యత్తులో జరగకుండా చూస్తున్నాం. రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారులపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తాం. వాహనాల వేగ నియంత్రణను అరికట్టేందుకు స్పీడ్ లేజర్ గన్‌తో తనిఖీలు చేపడుతున్నాం.

– ఈ.మీరాప్రసాద్, డీటీసీ, వైఎస్ఆర్ జిల్లా

భారీ వాహనాల వేగ నియంత్రణపై దృష్టి



కర్నూలు– చిత్తూరు జాతీయ రహదారిపై భారీ వాహనాలు మలుపు తిరిగే సమయంలో వేగ నియంత్రణ కోల్పోయి గువ్వలచెరువు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు వెడల్పు వున్నప్పటికీ వాహనాలు వేగంగా దూసుకురావడం .. నియంత్రణ కోల్పోవడం జరుగుతోంది. ఆర్అండ్‌బీ, రవాణా శాఖ అధికారులతో అధ్యయనం చేసి తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– వి.హర్షవర్ధన్‌రాజు, వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ

నేడు విద్యుత్తు అమరవీరుల సంస్మరణ సభ

సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో బుధవారం విద్యుత్తు అమర వీరుల సంస్కరణ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్తు చార్జీల పెంపును నిరసిస్తూ వామపక్షాలు, కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమించగా.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రదర్శన నిర్వహిస్తున్న కార్యకర్తలపై లాఠీలు, తూటాలు ఝళిపించేలా చేయడంతో ముగ్గురు ప్రాణాలు అర్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వాల అదే శాలతో నివాస గృహాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టరాదని తెలుగుదేశం ప్రతి పక్షంలో ఉన్నపుడు వ్యతిరేకించి.. ఇపుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాలను రద్దు చేయలేదన్నారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను భద్రపరుస్తున్నారన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డిపో కార్యదర్శి శ్రీనివాసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్సార్టీసీలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, పీఎస్.ఖాన్, టీఎం.బాషా డిమాండ్ చేశారు. రీజియన్ వ్యాప్తంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా సమస్యలు పరిష్కరించకపోగా, జమ్మలమడుగు, కడప డిపో మేనేజర్లు మరిన్ని సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. ఐదు డిపోలలో నైట్ అలవెన్స్ కలిపి ఒక్క కడప డిపోలో కలపకపోవడం తగదన్నారు.

వడ్డెపల్లెలో విషాదం

గ్రామాలకు చేరిన మృతదేహాలు



వడ్డెపల్లెలో మృత దేహాలను అంబులెన్స్ నుంచి దింపుతున్న బంధువులు

చక్రాయపేట: వడ్డెపల్లె, చక్రాయపేట గ్రామాల్లో విషాదం అలుముకుంది. గువ్వల చెరువు ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలు మంగళవారం సాయంత్రం ఆయా గ్రామాలకు చేరడంతో గ్రామస్థులు, బంధువులు చేరి రోదించడం అందరినీ కలచివేసింది. గువ్వల చెరువు ఘాట్ వద్ద ఘోర ప్రమాదం రాత్రి సమయంలో జరగడంతో పోలీసులు చేరుకొని చనిపోయిన ఐదుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శవ పరీక్ష అనంతరం మృత దేహాలను వారి బంధువులకు అప్పగించారు. అనంతరం చిన్న వెంకటమ్మ, నాగయ్య, నాగలక్ష్మిల మృతదేహాలను వడ్డెపల్లెకు, మహబూబ్‌షరీఫ్ మృతదేహాన్ని చక్రాయపేటకు తరలించారు. అంబులెన్స్ ఊర్లోకి రాగానే బంధువుల రోదనలతో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతురాలు చిన్నవెంకటమ్మ అదే గ్రామంలో అంగన్‌వాడీ స్కూల్‌లో ఆయాగా, నాగలక్ష్మి ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. నాగయ్య తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రాంతంలో చిరు వ్యాపారం చేస్తున్నారు. మహబూబ్‌బాషా సొంతంగా కారు కొనుగోలు చేసుకొని బాడుగకు తిప్పుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

నేత్ర దానంతో చూపు ప్రసాదిద్దాం

జిల్లా అంధత్వ నివారణ సంఘం ప్రోగ్రాం మేనేజర్ డా.సునీత



మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణ సంఘం ప్రోగ్రాం మేనేజర్ డా. సునీత

వైవీయూ : నేత్రదానం చేసి అంధత్వం నివారించవచ్చునని జిల్లా అంధత్వ నివారణ సంఘం ప్రోగ్రాం మేనేజర్(డీపీఎం) డా.సునీత అన్నారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీఎం డా.సునీత మాట్లాడుతూ ఒక వ్యక్తి నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చన్నారు. రాష్ట్రంలో ఐ డొనేషన్‌పై అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. పుష్పగిరి కంటి వైద్య శాఖ మేనేజర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో కార్నియా సేకరణ లేనందున 'ఐ' బ్యాంకు నిర్వహణ సాధ్యం కాలేదన్నారు. డీబీసీఎస్ కంటి వైద్య నిపుణులు డి.రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమం, ప్రభుత్వ సహాయక చర్యల గురించి వివరించారు. ప్రిన్సిపల్ డా.వేమల సలీం బాషా, అధ్యాపకులు జయంతి, కంటివైద్య విభాగం అధికారులు సుధాకర్‌రెడ్డి, గంగయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా నిలిపివేత



ఇసుక రవాణా నిలిపివేయడంతో బారులు తీరిన వాహనాలు

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డంప్ రవాణాను మంగళవారం తాత్కాలికంగా నిలిపి వేశామని తహసీల్దార్ మురాషావలి తెలిపారు. జ్యోతి గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి వెంకటసుబ్బమ్మ అనే మహిళా రైతు 143/1, 143/2అనే సర్వే నంబర్‌లో తనకు 4 ఎకరాల భూమి ఉందని ఆ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక రవాణాను నిలుపుదల చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పేషీలో సోమవారం ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ మురాషావలి ఇసుక డంప్‌ను పరిశీలించి వాహనాలను నిలిపేశారు. సమస్య పరిష్కారం కోసం ఆ ప్రాంతంలో సిబ్బందితో సర్వే నిర్వహించారు. అధికారులకు నివేదిక పంపి రెండు రోజుల్లో యథావిధిగా ఇసుక రవాణా కోసం వాహనాలను అనుమతిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సూచనతో అంధత్వ నివారణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఇతర అధికారులు

కడప రూరల్ : వైద్యుల సూచనతో అంధత్వ నివారణకు కృషి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోప నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషకాహార లోపం, అంటు వ్యాధి సంభవించడం, రసాయన చర్యలు, వంశపారంపర్యం తదితర కారణాలతో అంధత్వ సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈసంస్థ ఉపాధ్యక్షుడు అనూష, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డాక్టర్ రమేష్, మనోరమ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడల పోటీలు



పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో మంగళవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు అమృత్‌రాజ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ శ్రేణులపై కేసు నమోదు

కడప అర్బన్: కడప నగర మేయర్ కె. సురేష్ బాబు ఇంటి వద్ద ఆందోళన చేయడంతో పాటు, చెత్తను ఇంటిలోకి విసిరేశారనీ బాధ్యులైన వారిపై మేయర్ ఫిర్యాదు మేరకు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్, ఇంకా 14 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు, తమ సహచరులు చిన్నచౌక్ పోలీసు స్టేషన్ వద్ద న్యాయకోసం బైఠాయించారు. తరువాత పోలీసులు మేయర్‌తో పాటు, మరో 14మందిపై కేసు నమోదు చేశారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అమ్మాలి

– జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఎరువుల డీలర్లు రైతులకు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని, అధికంగా అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎరువుల కొరత లేదని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం యూరియా 4413.10 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2887 టన్నులు, ఎంవోపీ 2023.2 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 16618.63 టన్నులు, ఎస్ఎస్‌పి 1626.2 టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ సాధారణసాగు విస్తీర్ణం 75,189 హెక్టార్లుకాగా ఇప్పటి వరకు 27148 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయని తెలిపారు. ఇందులో వరి 7535 హెక్టార్లలో వరి సాగైయిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం కేసీ కెనాల్‌కు నీరు విడుదలైయిందని కేసీ పరిధిలోని 11 మండలాల్లోని రైతులు ముమ్మురంగా వరినాట్లు వేస్తున్నారని తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో, డీలర్ల వద్ద ఉందన్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించండి

– జాతీయ చైర్మన్ కాసల కోనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కాసల కోనయ్య

కడప కార్పొరేషన్ : జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం(గ్రా) వ్యవస్థాపక జాతీయ చైర్మెన్ కాసల కోనయ్య, జిల్లా చైర్మెన్ లోకేష్ కోరారు. జిల్లా ముఖ్య సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు పొందాలని తెలిపారు. సభ్యులకు సమస్యలుంటే తనకు తెలపాలన్నారు. సెప్టెంబర్ 11న అనంతపురంలో వార్షికోత్సవ వేడుక నిర్వహిస్తున్నామని, కడప జిల్లా నుంచి అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక ఓబులేష్, రవికుమార్, సురేష్ బాబు, రామకష్ణ , జి.రాఘవ, సుబ్బరామయ్య, శిల్పారెడ్డి, జాకీర్, గౌస్, రామయ్య, చెన్నకేశవులు, సభ్యులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో జన సైనికుల పోట్లాట

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు జనసేనలో విభేదాలు కొనసాగుతున్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలో జనసేన కొట్లాట.. టీడీపీకి ఆటగా మారింది. రెండు పార్టీల్లో జన సైనికులు ఉన్నారు. కానీ వర్గ విభేదాలు జనసేన పార్టీలో నాయకత్వ లోపాన్ని కొట్టి చూపుతున్నాయి. అధినేత పవన్ కళ్యాణ్ వచ్చినప్పటికీ విబేధాలు పరిష్కారం కాలేదు. మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఇరు వర్గాలు ఇంద్రా బస్‌షెల్టర్‌ను ఆధునికీకరించే విషయంలో ఘర్షణ పడ్డారు. స్థానిక మరుగన్ స్వీట్స్ వద్ద అమర్‌నాథ్, మరికొంత మందితో కలిసి మైసూరావారిపల్లికి చెందిన పగడాల వెంకటేష్, చంద్రశేఖర్‌లు దాడి చేశారు. పిడిగుద్దులు గుద్ది చొక్కాలు చించారు. గాయపడిన అమర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. జనసేనలో వర్గ విభేదాలు ముందుగా తెలిసినా మిన్నకుండి పోవడంలో ఆంతర్యమేమిటని పలువురు చర్చించుకొంటున్నారు. ఈసంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముత్యాల కిషోర్, నాగోలు అమర్‌నాద్,షేక్‌అబ్దుల్, వీరు తదితరులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు.